క్లుప్తంగా

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: రైతుబీమా పథకానికి సంబంధించి అర్హులైన రైతుల వద్ద నుంచి శుక్రవారం దరఖాస్తులు స్వీకరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ నవీన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి అర్హులైన రైతుల వద్ద నుంచి సిబ్బంది దరఖాస్తులు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పోడు పట్టా పుస్తకాలు అందించిన రైతులు కుడా దీనికి అర్హులేనని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణపై హర్షం

మణుగూరు రూరల్ : సింగరేణి సంస్థలో ఎస్అండ్‌పీసీకి అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఉచితంగా మెడికల్ ఎంవీటీసీ శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి ఉన్నతాధికారులు ఆదేశాల జారీ చేయడంపై ఇఫ్టూ నాయకులు మంగీలాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులందరికీ ఒకే రకమైన యూనిఫాం అమలు చేయాలని, సెక్యూరిటీ డిపాజిట్లను తొలగించాలని, గార్డులను రక్షణ కల్పించాలని, ఖాళీ క్వార్టర్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు నరేష్, రాజేష్, సుధాకర్, రాజేంద్రప్రసాద్, వీరబాబు, నారాయణ, సురేష్‌బాబు, వెంకటేష్, వీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, నారంవారిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వినాయకపురం పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నారంవారిగూడెం పరిధిలో మధ్యాహ్నం 1గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామంలో శుక్రవారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, గోపాల్, చిలకమ్మ, ఆశ కార్యకర్త భూదేవి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం..

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలో శుక్రవారం ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు అరుణ, పావని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ పారామెడికల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రేపు భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీ సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్‌కు చెందిన హెగ్డే ఫెర్టిలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యురాలు శ్రీక్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతాన సమస్యతో బాధపడుతున్న వారు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘గృహలక్ష్మి’ని వెంటనే అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న వంశీ, గ్రామస్తులు

దుమ్ముగూడెం: గృహలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామస్తులతో కలిసి ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఎంపీడీఓ ముత్యాలరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మండలంలో 290 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరైతే ఇంకా 75 పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స విమల, కోర్స లక్ష్మీదేవి, అపక నాగమ్మ, అపక చంటి, పోడియం భద్రమ్మ, అపక రాజు పాల్గొన్నారు.

ఎటూ పోలేని దుస్థితి..



వానొస్తే.. బస్సుబంద్..!

- వర్షాలతో అధ్వానంగా దామరతోగు రోడ్డు
- జారిపోతున్న వాహనాలు
- బస్ సర్వీస్ నిలిపివేసిన ఆర్టీసీ అధికారులు
- ఏటా గిరిజనులకు తప్పనితిప్పలు



చిత్తడిగా మారిన దామరతోగు రోడ్డు

గుండాల: దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించని విధంగా రంగాపురం–సాయనపల్లి మధ్య రహదారి పరిస్థితి ఉంది. వానాకాలం వచ్చిందంటే చాలు రహదారులతో గిరిజనుల పాట్లు తప్పడం లేదు. ప్రతీ ఏటా ఇవే బాధలు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రహదారి బురదమయమై అధ్వానంగా తయారైంది. దీంతో మణుగూరు డిపో అధికారులు గుండాలకు బస్సును నిలిపివేశారు. బురద ఎక్కువ ఉండటంతో ప్రైవేట్ వాహనాలు సైతం జారిపోతున్నాయి. దీంతో పాఠశాలలు, ఆస్పత్రులు, వ్యవసాయ పనులకు నిమిత్తం అటు మణుగూరు ఇటు గుండాల ఎటూ వెళ్లలేని పరిస్థితి.

నిలిచిపోయిన పనులు..

గుండాల–వీరాపురం మధ్య 30 కి.మీల పరిధి బీటీ రోడ్డు, బ్రిడ్జీల నిర్మాణానికి నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధికి ఐదేళ్లక్రితం రూ.28 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా నాలుగు బ్రిడ్జీలు పూర్తయ్యాయి. కానీ అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు పనులు నిలిచిపోయాయి. వెంకటాపురం–దామరతోగు– వీరాపురం గ్రామాల మధ్యనే పనులు నిలిచిపోయాయి. దీంతో వర్షాలు పడుతుండడంతో రోడ్డంతా కోతకు గురైంది. కల్వర్టులు లేని చోట మరీ అధ్వానంగా మారింది.

వాహనాలు రాక నరకయాతన..

నాలుగు రోజులుగా బురద ఎక్కువై వాహనాలు జారిపోతున్నాయి. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. దీంతో సాయనపల్లి, దామరతోగు పంచాయతీ గ్రామాలతో పాటు గుండాల చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యార్థులు, రోగులు, వివిధ అవసరాల నిమిత్తం మణుగూరు వెళ్లే వారంతా ఇబ్బందులు పడలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దామరతోగు, వెంకటాపురం, మల్లెలగుంపు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కనీసం ప్రైవేటు వాహనాలు సైతం బురదలో తిరగడం లేదు. పలు మార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకుండా పోతుంది. దీంతో గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి రోడ్డు పనులను మోక్షం కలిగించాలని వేడుకుంటున్నారు. వర్షాలు లేకపోతేనే బస్సులు నడుపుతామని మణుగూరు ఆర్టీసీ అధికారులు అంటున్నారు.



వరదలతో కోతకు గురైన రోడ్డు

ప్రతీ ఏడాది ఇంతే..



వానాకాలం వచ్చిందంటే చాలు ఆర్టీసీ బస్సులను నిలిపివేస్తారు. పలుమార్లు మట్టిపోసినా ఫలితం ఉండడం లేదు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

–సుతారి సత్యం, దామర తోగు

మా గోస ఎవరికీ పట్టదు..



వానాకాలంలో అటు గుండాలకు, ఇటు మణుగూరుకు వెళ్లలేం. హాస్టల్‌కు పిల్లలు, వ్యవసాయ పనులకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మా గోస ఎవరికి చెప్పుకున్నా పట్టించుకోవడం లేదు.

– కుంజ ప్రశాంత్

అటవీ శాఖ అనుమతులు రావడం లేదు

రోడ్డు నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు రాలేదు. అనుమతులు లేక పనులు కావడం లేదు. పక్కన మట్టి పోయాలన్నా అనుతించడం లేదు. కాంట్రాక్టరుతో మాట్లాడి తాత్కాలిక మరమ్మతులు చేపడుతాం.

– మోతీలాల్, ఆర్అండ్‌బీ ఏఈ

పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రరావు

మణుగూరు రూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామంలో పద్మశాలిభవన్‌లో పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాచర్ల రామచంద్రరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్రతీ ఒక్కరు సంఘం సభ్యత్వాన్ని తీసుకోవాలని, తద్వారా పద్మశాలీల ఐక్యత చాటుకోవచ్చన్నారు.

సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సమ్మయ్య..

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ దుస్సా సమ్మయ్యను నియమిస్తూ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాచర్ల రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దుస్సా సమ్మయ్య మాట్లాడుతూ... సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం దుస్సా సమ్మయ్యను సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కోట శ్రీనివాస్, మహేశ్వరపురం రమేష్, కుర్రి నరసింహారావు, మరుగు రవీంద్రనాథ్, రుద్ర నాగరాజు, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శ్రీనివాస్, కనకయ్య, వెంకన్న, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణ లబ్ధిదారుల ఎంపిక



లాటరీ తీస్తున్న ఎంపీపీ పార్వతి

చండ్రుగొండ : మండలంలోని ముస్లిం మైనారిటీలకు మంజూరైన రుణాల లబ్ధిదారుల ఎంపిక శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఆరు యూనిట్లకు ఎంపిక నిర్వహించగా రూ. 2 లక్షలు రెండు, రూ.ఒక లక్ష రుణం యూనిట్లు 4 ఉన్నాయి. ఆరు యూనిట్లకు 135 మంది దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ పద్ధతిన ఎంపీపీ బాణోత్ పార్వతి, ఎంపీడీఓ జి.వతి ఎంపిక చేశారు. ఆరుగురికి లక్కీడిప్ తగలగా మిగిలిన 129 మంది నిరాశగా వెనుతిరిగారు. ఈ మేరకు జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, ఎంపీజే మండలాధ్యక్షుడు యూసుఫ్‌పఠాన్, మసీద్‌కమిటీ సభ్యుడు యండీ రవూఫ్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరిని గుర్తించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్ఓటూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఈసం కృష్ణయ్యను సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సెంట్రల్ కమిటీ ఇన్‌చార్జ్ కాజీపేట కృష్ణ, బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు శనిగరపు కుమారస్వామి, చీఫ్ అడ్వైజర్ రమేష్, సెంట్రల్ కమిటీ సభ్యులు విజేందర్, మధుసూదన్, బ్రాంచ్ కార్యదర్శి మధుకుమార్, పాపారావు, గంగాధర్, సందీప్, ప్రమోద్, కిషోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు



ములకలపల్లిలో..



చర్లలో..

సీసీ రోడ్లు ఎత్తు పెంచాలని నిరసన



వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, స్థానికులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సీసీ రోడ్ల ఎత్తు పెంచాలని వరద బాధితులతో కలిసి సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఇళ్లల్లోకి పెద్ద ఎత్తున వరదనీరు చేరిన విషయం విదితమే. ఈ క్రమంలో సీపీఎం నాయకులు వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... డ్రెయినేజీలు లేకపోవడం, వరదనీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో చినుకు పడితే భయపడాల్సిన పరస్థితి నెలకొందన్నారు. నాయకులు పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, బీజేపీ మండలాధ్యక్షుడు బోగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

భద్రాచలంటౌన్: పట్టణంలో లభ్యమైన గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం దహన సంస్కారాలు నిర్వహించేందుకు పలువురు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ రూ.5 వేలు, శాంతారావు రూ. వెయ్యి ఎస్సై మధు ప్రసాద్‌కు అందజేయగా ఆయన ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కరకగూడెం: పాత పెన్షన్ విధాన సాధనకు ఈనెల 19న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌పీఎస్‌ఈయూ మండలాధ్యక్షుడు రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి నూతన కలెక్టరేట్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు రామయ్యగా దర్శనం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రగిరి రామయ్య మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే గర్భగుడిలో శ్రీసీతారామ చంద్రస్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారు నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరగా, విష్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు.

‘సీజనల్’పై అప్రమత్తంగా ఉండాలి



కరకగూడెం: మాట్లాడుతున్న ఎంపీపీ కాళిక



గుండాల: అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరకగూడెం: సీజనల్ వ్యాధులపై అధికారులు సమన్వయంతో పనిచేస్తు ప్రజలను చైతన్య అప్రమత్తం చేయాలని ఎంపీపీ రేగా కాళిక అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి కారం మధు అధ్యక్షతన పలు శాఖల అధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.... గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, దోమల మందులను విధిగా పిచికారీ చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని పలు రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొమరం కాంతారావు, అధికారులు పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి మనీష్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఆస్పత్రిలో జ్వరం లక్షణాలు ఉన్న వారు టెస్టులు చేయించుకోవాలన్నారు. జన ఆరోగ్య కమిటీ నియమించాలని తెలిపారు. నూతనంగా మంజూరయిన పోస్టుమార్టం సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ నాగదివ్యను కోరగా స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముక్తి సత్యం, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, ఎంపీఓ వలీ, సీహెచ్ఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంటీఎస్ పీ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

దుమ్ముగూడెం : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మలు అన్నారు. శుక్రవారం దుమ్ముగూడెం గ్రామంలోని ఎస్సీఈ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్స్, బ్యాగ్స్, దుప్పట్లు, కార్పెట్, స్టీల్ ప్లేట్, గ్లాసు, కప్పులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కొర్సా చిలకమ్మా, సర్పంచ్ మడి రాజేష్, హెచ్ఎం అప్కా శంకర్, హాస్టల్ సంక్షేమాధికారి మల్లిఖార్జునరావు, గ్రామస్తులు కొత్తూరి సీతారామరావు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నాగరాజు

మణుగూరు రూరల్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జెడ్పీటీసీ పోశం నరసింహరావు, తహసీల్దార్ కె.నాగరాజు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ భద్రాచలం వారి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజలకు మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటింగ్ యంత్రాలపై ఓటింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.3 వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కాగా ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాహీన తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముందస్తు అరెస్ట్

భద్రాచలంటౌన్: ఐటీసీ విస్తరణలో భాగంగా శుక్రవారం జరిగి ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమం నేపథ్యంలో పట్టణ పోలీసులు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడా పాల్‌రాజును శుక్రవారం ముందుస్తుగా అరెస్ట్ చేశారు. ఐటీసీ విస్తరణకు తాము వ్యతిరేకమని వారు ప్రకటించడంతో అరెస్ట్ చేసి వదిలివేశామని పోలీసులు తెలిపారు.

ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం

మణుగూరు రూరల్: మండలంలోని సమితి సింగారం, సుందరయ్యనగర్‌లలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సమితిసింగారం ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుతున్న విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ సమావేశంలో పాల్గొని పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు ‘రక్షణ’ కరువు



మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం

- ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్న వసతి గృహం విద్యార్థులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహానికి రక్షణ కరువైంది. బీసీ హాస్టల్ భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పశువులు చేరడంతో ఆవరణ అపరిశుభ్రంగా తయారవుతోంది. ఆవరణ పశువులకు అడ్డాగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు హాస్టల్ ఎదుట హరితహారంలో నాటిన మొక్కలను పశువులు పూర్తిగా తినేస్తున్నాయి. భవనం పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతో సెలవులలో విద్యార్థులు సరదాగా ఆడుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రహరీ సమస్య అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించి ఇబ్బంది లేకుండా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.